# కోతి కొమ్మచ్చి

(ఇం) కోతి కొమ్మచ్చి

ముక్కోతి కొమ్మచ్చి

అనుబంధం

కొసరు కొమ్మచ్చి తో

బాపు రమణీయం

ముళ్ళపూడి వెంకటరమణ

ఎమెస్కో

# కొహోతి కొమ్మచ్చి

**కొహొూతి కొమ్మచ్చి**
**కొమ్మకి రెమ్మొచ్చి**
**రెమ్మకి పువ్వొచ్చి**
**పువ్వకి నవ్వొచ్చి**
**నవ్వకి నువ్వొచ్చి**
**నీకు నేనొచ్చి**
**కోతి కొమ్మచ్చి...**

సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ అన్నారు పండిత కవి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు.




మేము ఒప్పుకోలేదు. మేం తీశాం. "స్నేహం" అనే సినిమా తీశాం. మాకు ముందు హిందీలో "దోస్తీ" అనే సినిమా తీశారు–తారాచంద్ బార్జాత్యా.




"తీయనిది అంటే సినిమా తీయకపోవడం కాదండి– తీయనిది అంటే తీపిగా ఉండేది. స్నేహం మధురమైనది అని కదా" అన్నారు స్వాతి బలరామ్ గారు.

"ఓహో అదా– అయితే అలాటి తీపివి చాలానే ఉన్నాయి. వేసవి వెళ్ళగానే వచ్చే తొలకరి వానజల్లుకి మట్టి గుబాళించే వాసనల జల్లు తీయన... అమ్మానాన్నల ముద్దులు తీయన– ఆలుమగల తొలిముద్దు అంతకంటే... మసక సంజెలో తొలికౌగిలీ– తగిలీ తగలని చేతులూ– కలిసీ కలియని చూపులూ– కృష్ణశాస్త్రిగారన్నట్లు పంచదారకన్న పరదార తీపిరా అని... వీటన్నిటినీ మించినది పొగడ్త–బహుతీపి...





మహాప్రభో–మీ అంతటి గొప్పవారు లేరు– అని నిర్భయంగా చెప్పడం మనం వినడం ఎంత తీపి!? ఇవన్నీ సరేగానీ–వీటన్నిటినీ మించిన రుచి ఇంకోటి ఉంది... గడచిపోయిన కష్టాల కథ– ఈదేసిన గోదావరి– దాటేసిన గండం– తార్రోడ్డుమీద ఎండలో జోళ్ళు లేకుండా నడిచి నీడకు చేరిన కాళ్ళు–ఈ కష్టాలు–అనుభవిస్తున్నప్పుడు బాధగానే ఉంటుందిగాని అవి దాటిపోయాక– వాటిని తలుచుకోవడం– వినేవాళ్ళకి అనుభవాలుగా చెప్పడం– ఆ హాయికి కొత్తావకాయ కూడా సాటిరాదు– అందుకే గతకాలము మేలు వచ్చుకాలముకంటే అన్నారు పెద్దలు... ”



“రమణగారూ–మీరు దారితప్పి ఎటో వెళ్ళిపోతున్నారు. నేను అడిగింది ఈ హరికథ కాదు– మీ కథ– మీ ఆత్మ కథ.. అనగా టెలుగులో ఆటోబయోగ్రఫీ” అన్నారు బలరామ్ గారు సహనాన్ని అభినయిస్తూ.



“అయ్యా–ఆత్మకథ అంటే సొంతడబ్బా–మరియు పరనింద అని తాత్పర్యం–ఎంత మంచివాడికైనా వినయభూషణుడికైనా–తెలీకుండా అతిశయోక్తులు పెన్నులో దూరిపోతాయి. వాటినే గిట్టనివాళ్ళు అబద్ధాలు అంటారు. కొయ్ కొయ్ అంటారు–అదే హెమింగ్వే అన్నట్లు నో మాన్ ఈజ్ ఏన్ ఐలండ్... సెర్లో బెడ్డేస్తే నీరంతా కదులుద్ది–ఊరంతా తగులుద్ది... ఆత్మకథ రాస్తూ ‘నేను ఒహ గొప్పవాణ్ణి’ అంటే పదిమంది చవటలున్నారు అనే కదా–అందుకే ఆత్మకథ రాయటం నాకు భయం–పీల్చే ఊపిరిలా అబద్ధాలు లోపలికి దూరిపోతాయి.



అయినాసరే–మీరన్నట్లే స్వాతి పాఠకదేవుళ్ళకు నా కథ నివేదిస్తాను. కానీ–‘నిజం చెప్తానూ నిజమే చెప్తానూ నిజం తప్ప వేరొకటి చెప్పనూ’ అని అబద్ధాలు చెప్పలేను– ఎందుకంటే నేను హరిశ్చంద్రుణ్ణి కాను–అయినా అబద్ధాలు దుడుకుగా దుబారాగా వాడను–చాలా పొదుపుగా ధర్మరాజులాగా వాడతాను–ఆయన వెయ్యి నిజాలు పెట్టుబడిగా ఒక్క అబద్ధం అశ్వత్థామ హతః (కుంజరహహ్) గుర్తుందిగా–వాడాడు. అంటే నిజం ఒక గొప్ప సుగుణమని కాదుస్మండీ–కేవలం లాభసాటి గుణం అని. అబద్ధాలు చెప్పడానికి జ్ఞాపకశక్తి ఉండాలి. కొందరు గ్నాపకశక్తి అంటారు–అదే రైటు అనికూడా అంటారు– వ్యావహారిక భాషాప్రవీణ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు జ్ఞాపకం అనే పద ఉచ్చారణ గురించి బాగా పరిశోధించారు.



ఇంగ్లీషులో knife లో, knight లోకే’, Psycho- logyలో, Psephology లో–‘పీ’ పలకవుకదా– అలాగే జ్ఞాపకంలో ‘ఞ’ బదులు ‘న’ బాగా పలుకుతుంది. ఈ దేవరహస్యం తెలిసినవారు ముగ్గురే– తాను, శ్రీ నార్ల వారు, శ్రీ ఎన్.టి. రామారావు అని ఆయన ఏనాడో ఉద్ఘాటించారు. అయినా నేను, రామారావుగారు నటించిన ‘రక్తసంబంధం’ సినిమాలో కృతజ్ఞత అనే పదం వాడటం ఇష్టంలేక దానికి బదులుగా–నీ మేలు మరిచిపోను బ్రదరూ అని డైలాగు రాశాను. రామారావుగారు అది చూసి–వాట్ బ్రదర్–ఇంత పెద్ద డైలాగెందుకు–నేను కృతగ్నుడిని అంటే పోలా అన్నారు.